# ప్రతిబింబాలు

-జాస్తి రమాదేవి

మే నెల మిట్టమధ్యాహ్నం

ఏ.సి. గది చల్లగా ఉంది... తనువు సుఖలాలనలో తేలుతూ కలలు కంటోంది.

"అమ్మా! అమ్మా!" నిద్ర మెలుకువ కాని అవస్థలోంచి బయటికి రావాలన్పించటం లేదు... అయినా "అమ్మా!" అని అంత ఆత్మీయంగా పిలిచే కొడుకు నాకెవరున్నారు?.. ఉన్న ఒక్కడూ అమెరికాలో సెటిలైపోయాడు.

"అమ్మా!" మరోమారు... మనస్సు ఒక్కసారిగా మేలుకుంది. నన్ను చూడాలనిపించి నా కొడుకు వేణు అమెరికా నుండి వచ్చేశాడు. ఇంక దేహం మంచం మీద ఆగలేదు. కాళ్లు పరిగెత్తాయి.

కిటికీలోంచి బయటికి చూశాను. కళ్లకెవరూ కనిపించలేదు... అంతా భ్రాంతి... నా పిచ్చిగాని ఐదేళ్లుగా రాని వాడు హఠాత్తుగా ఈ మే నెలలో మిట్ట మధ్యాహ్నం పూట కబురు కాకరకాయ లేకుండా ఏ వింతా విశేషం లేకుండా వచ్చి నన్ను 'అమ్మా' అని పిల్చి సర్ప్రయిజ్ చేస్తాడా! కాళ్లు నీరసంగా వెనక్కి తిరిగాయి. నా అనుమతి లేకుండానే కళ్లలోంచి నీళ్లు తుళ్లితుళ్లి పడ్డాయి.

"అమ్మా!" ఆగాను... సందేహిస్తూనే మెయిన్ డోర్ తీశాను... ఆజానుబాహువులా కనిపించే నా వేణు కన్పించలేదు గాని మూడడుగుల కుర్రాడు చిరిగిన బట్టలతో చెదిరిన జుట్టుతో చారికలు కట్టి మురికి పట్టి పోయిన ఆరేడు ఏళ్లున్న చిన్న కుర్రాడు కన్పించాడు... వీడా నన్ను పదేపదే 'అమ్మా' అని పిలిచాడు.

"ఏం కావాలి?" కాస్త కోపంగా గద్దించాను.

వాడు బిత్తర చూపులు చూస్తుంటే జాలేసి 'ఉండు' అని చెప్పి లోనికెళ్లి ఓ రూపాయి బిళ్ల తెచ్చి వాడి చేతిలో పెట్టాను. వాడు కదల్లేదు. హాయిగా ఏ.సి. రూంలో నిద్రపోతుంటే నిద్ర లేపి... వీడితో ఇదేం పనిష్మెంట్ నాకు. బయట ఎండ మండిపోతూ ఆ వేడి మొహాన్ని తాకి మండిస్తోంది.

"ఏం కావాలిరా..." అన్నాను కొంచెం విసుగ్గా.

"ఆకలి వేస్తోంది.." అన్నాడు పొట్ట తడుముకుంటూ.

"ఇక్కడే కూర్చో..." అని చెప్పి లోనికెళ్లి పనిపిల్ల తినే ప్లేటులో కాస్త అన్నం, పచ్చడి వేసి పట్టుకొచ్చి 'తిను' అంటూ వాడి ముందు పెట్టాను. వాడికి సరిగ్గా కలుపుకోవటం కూడా రాలేదు... ఒక్క ముద్ద నోట్లో పెట్టుకొని నోరు తెర్చి వొగుర్చుతూ నా వైపు చూసి... 'కారం' అన్నాడు.

పాపం చిన్న కుర్రాడు. ఈ ఎండ పూట వాడికి పచ్చడి మెతుకులు పెట్టానే... ఈ వయస్సులో వేణుని ఎంత గారాబంగా చూసుకునే దాన్ని... కూర అన్నంలో నెయ్యి వేసి ఇంకా కారం వస్తుందని మీగడ పెట్టి, గడ్డపెరుగుతో ముద్దలు తినిపిస్తూ బోలెడు కథలు, కబుర్లు చెప్పేదాన్ని. పాపం అలా చూడ్డానికి వీడికెవరూ లేరా... అమ్మ లేదా!

వాడు మరో ముద్ద నోట్లో పెట్టుకునే సాహసం చెయ్యకుండా నా వైపు చూడసాగాడు. ఫ్రిజ్‌లో ఉన్న పెరుగులో అన్నం వేసి కలిపి ప్లేట్లో పచ్చడి అన్నం బయట పడేసి రమ్మని చెప్పగానే వాడు పరుగెత్తి గేటు పక్కగా అన్నం పడేసి వచ్చి నా వైపుకు ప్లేటు పట్టుకుని నిలబడ్డాడు. పెరుగన్నం కదా గబా గబా తినేశాడు. పైపు చూపిస్తే ప్లేటు కడిగి పట్టుకొచ్చి నిలబడ్డాడు. ఇంకా ఏమిటి! అన్నట్టుగా చూస్తుంటే వాడు బట్టలు చూపించి 'బట్టలు కావాలి' అన్నాడు.

లోనికెళ్లి పాత బట్టలున్న షెల్ఫ్‌లోంచి చిన్నప్పటివి వేణు బట్టలు దాచి పెట్టాను వాటిలోంచి ఓ జత తీసి వాడికిచ్చి 'ఇంక వెళ్లు' అన్నట్టుగా చూసి తలుపు వేయబోయాను.

వాడు గేటు బయటకి పోలేదు... కుళాయి దగ్గర స్నానం చేసి నేనిచ్చిన గుడ్డలు వేసుకుని వాడి గుడ్డలు ఉతుక్కుని డాబా మీదకి పరిగెత్తి ఆరేసుకుని వచ్చాడు.

వాడి చేష్టలు ముద్దొస్తున్నా వాడెవరో తెలీకుండా వాడిని లోనికి రానిచ్చినందుకు ఆయన వచ్చీ రాగానే నన్ను తిట్టడం ఖాయం... వీడు వెళ్లిపోతే బాగుండును.... మనస్సులో అనుకుంటున్నాను... వాడప్పటికే గుమ్మంలో ఓ పక్కగా పడుకుని నిద్రపోతుంటే వెర్రిదానిలా చూస్తూ వాడికి కాపలా కాస్తూ కూర్చున్నాను. గదిలో ఏ.సి తిరిగి పోతూ ఉంది. అది ఆపాలన్న ధ్యాస కూడా రావటం లేదు.

వీడెవడో? ఎక్కడి నుంచి వచ్చాడో తెలీదు... ఈమధ్య నగరంలో దొంగల భయం ఎక్కువగా ఉంది... పట్టపగలైనా నాటకీయంగా ఇంట్లో జొరబడి ఇంట్లో ఉన్న వాళ్లను గాయపర్చి దొరికింది పట్టుకుపోతున్నారు... వీడు వాళ్లలో ఒకడు కాదు కదా!

ఏమో ఇలా పిల్లల్ని కూడా పంపి వెనుకే పెద్ద వాళ్లు రావచ్చు ఎందుకైనా మంచిది. ఇక్కడే ఉండి వీడికి కాపలా కాయటం మంచిది అనిపించింది. సబ్బు లేకున్నా వాడు శుభ్రంగా స్నానం చేసి వచ్చాడు. మంచి రంగుతో ముద్దుగా ఉన్నాడు. పాలుగారే పసిబుగ్గలు యాపిల్ పళ్లలా ఉన్నాయి. జుట్టు చక్కగా క్రాఫ్ చేసి దువ్వితే! చిన్నప్పటి వేణు లాగే ఉంటాడు... వీడిని చూస్తుంటే పదే పదే వేణునే గుర్తొస్తున్నాడు.

చక్కగా ఇంజనీరింగ్ చదివినవాడు అమెరికా వెళ్లాలని ఆశపడ్డాడు. ఒక్కడే కదాని బాధపడ్డా వాడి ఆశని ఆశయాన్ని కాదనలేక ఒప్పుకోవాల్సి వచ్చింది. రెండేళ్ల చదువు తర్వాత కొత్తగా జాబ్‌లో జాయిన్ అయ్యాను. రాలేని పరిస్థితి అన్నాడు. మనసుకు నచ్చజెప్పాము.



మరో ఏడాది తర్వాత "నేను మేగి అనే అమ్మాయిని పెళ్లిచేసుకోబోతున్నాను" అన్నాడు.

వాడు మమ్మల్ని సలహా అడగలేదు. వాడి నిర్ణయం మాత్రమే చెప్పాడు. ఏం అనలేకపోయాం. ఇంటర్‌నెట్‌లో ఫోటోలు పంపించాడు. నీళ్లతో మసకబారిన కళ్లకు అవి అస్పష్టంగా కనిపించాయి. సరే ఇద్దరూ ఒక్కసారి ఇండియా రండని ప్రాధేయపడ్డాం.

"మేగి ఇప్పుడు ప్రెగ్నెంటు. వాతావరణం తేడా వస్తుంది తర్వాత వస్తాము" అని మెయిల్ చేశాడు. కనీసం వాడితో చాటింగ్ చెయ్యొచ్చని కష్టపడి నేను కంప్యూటర్ నేర్చుకుని ఆయనతో పోట్లాడి కంప్యూటర్ కొనిపించుకున్నాను. కానీ వాడికి నాతో చాటింగ్ చేయటానికి ఎప్పుడోగానీ టైమ్ దొరకదు.

బాబు పుట్టాడని వాడి ఫోటోలు ఇంటర్‌నెట్‌లో చూపించాడు. కారు, ఇల్లు కొనుక్కున్నప్పుడు అన్నీ ఎప్పటికప్పుడు కంప్యూటర్ తెర మీద చూపిస్తున్నాడు. ప్రత్యక్షంగా చూసే భాగ్యం మాకు కలుగలేదు.

'నువ్వు నాకు నచ్చావు' సిన్మాలో వెంకటేష్ చెప్పింది నాకు బాగా నచ్చింది. అమెరికా వెళ్లాలనేది మా నాన్న కోరిక. అమలాపురంలో ఉండి మా నాన్నని దగ్గరుండి చూసుకోవాలన్నది నాకిష్టం. ఎక్కడో ఉండి 'నాన్నా నేను కారు కొన్నాను' అని దాని పక్కన నిలబడి ఓ ఫోటో తీయించుకుని పంపితే మా నాన్నకు చూపించగలనుగానీ కారులో ఎక్కించుకుని తిరగగలనా.. అదే ఇక్కడే ఉండి వ్యవసాయం చేస్తూ మా నాన్నని ట్రాక్టర్ మీద ఎక్కించుకుని తిరిగితే నాకు ఆయనకి సంతోషంగా ఉంటుంది. నిజంగా ఆ కాన్సెప్ట్ నాకు బాగా నచ్చింది. అందుకే ఆ సిన్మాని చాలాసార్లు చూశాను.

నిద్రలో పిల్లాడు అటు నుంచి ఇటు తిరిగాడు. పాపం చెమటతో ముద్దయిపోయాడు. వరండాలో ఉన్న ఫేను స్విచ్ ఆన్ చేశాను.

ఒక్కసారిగా వేడిగాలి మీదికొచ్చి ఉక్కిరిబిక్కిరి చేసింది. ఫేను స్విచ్ ఆఫ్ చేసి పేపరుతో వాడికి విసురుతూ కూర్చున్నాను. ఆఫీసు నుంచి ఆయన వచ్చేలోగా వీడు వెళ్లిపోతే బాగుండును. మనస్సులో పదేపదే అనుకుంటూ కూర్చున్నాను.

★★★

గడియారంలో చిన్నముల్లు నాలుగ్గంటలు అన్నట్టుగా చూపిస్తోంది. వీడింకా లేవడేమిటి.. నా ఖర్మ కాకపోతే వాడిని చూసి నేను మురిసిపోవటం ఏమిటి! కాస్త గద్దించి ఉంటే మరో చోటుకి పోయేవాడు కదా. అక్కడికీ రెండు మూడు సార్లు కదిలించి చూశాను గానీ వాడు లేవలేదు.

కడుపు నిండా తిని స్నానం చేసి కాస్త చోటు దొరగ్గానే అదే చాలు అన్నట్టుగా వాడు గాఢ నిద్రపోతున్నాడు.

నేనెలా వాడిని లేపగలను... అదే వేణుని అయితే ఇలా కటిక

నేల మీద వేడి తగిలేలా పడుకోనిచ్చేదానినా! హాయిగా మంచం మీద పడుకోబెట్టేదాన్ని. ఏ.సి.రూంలో సుఖంగా పడుకునేవాడు. పాపం వీడికి అమ్మానాన్న లేరా? ఉండే ఉంటారు.

ఎలాగో వీడు తప్పిపోయి ఉంటాడు. ఎలాగైనా ఆయన వీడిని వాళ్లవాళ్లకి అప్పగిస్తే బాగుండును అన్న అభిప్రాయానికి వచ్చేశాను. అందుకే ఆయన కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను.


బైక్ చప్పుడు వినగానే గేటు ఓపెన్ చేశాను.

"ఏమిటి సంగతి? ఈవేళకి దేవిగారు ఏ.సి.రూంలో హాయిగా రెస్టు తీసుకుంటూ ఉంటారుగా..." అంటూ నవ్వుతూ చమత్కారం విసిరారు.

నాకు నమ్మరాలేదు.


అప్పటికే చెమట్లు పట్టేసి నీరసంగా కన్పిస్తున్న నన్ను చూడగానే ఆయన కంగారు పడ్డారు.

"ఏమైంది అన్నపూర్ణా?" బైక్‌కి స్టాండు వేసి కంగారుగా నన్ను సమీపించాడు. నేను అరుగు వైపు చూపించాను.



## 'అతిథి'లో అతిథి

తెలుగు సినిమాలకు ఇలియానా గుడ్‌బై చెప్పాలనుకుంటోంది అనే వార్త జోరుగా తెలుగు సినిమా ఇండస్ట్రీలో జోరుగా వినిపిస్తోంది. 'పోకిరి'లాంటి బంపర్ హిట్ సినిమాలో మహేష్‌కి జంటగా నటించిన ఇలియానా అదే మహేష్ హీరోగా నటిస్తున్న 'అతిథి' సినిమాలో ఓ పాటలో మహేష్‌తో స్టెప్పులేయబోతోందిట. ఈ ఐటమ్ నంబర్ కోసం ఇలియానాని నిర్మాతలు సంప్రదిస్తున్నారని, బహుశా ఆమె నుంచి గ్రీన్ సిగ్నల్ రావచ్చునే ఆశాభావంతోనే వున్నారట.




ఆయన దృష్టి అరుగుమీద నిద్రపోతున్న కుర్రాడిపై పడింది.

ఆయన కనుబొమ్మలు ముడిపడ్డాయి. ప్రశ్నార్థకంగా నా వైపు చూసి "వీడెవడు?.." అనడిగారు.

"తెలీదు" అన్నాను.

"తెలీకుండా గేటు లోపలికి ఎలా రానిచ్చావు..?" కోపంగా అడిగారు.

"వాడే వచ్చాడు. ఆకలేస్తోందన్నాడు. అన్నం పెట్టాను. బట్టలు మురిగ్గా ఉన్నాయని వేణువి చిన్నప్పటి బట్టలు ఇచ్చాను. వెళ్లిపోతాడనుకుంటే స్నానం చేసొచ్చి ఇక్కడే పడి నిద్రపోయాడు. మిట్టమధ్యాహ్నం పూట వాడినెలా తరిమెయ్యను?"

నేను చెప్పింది విని ఆయన ఆలోచిస్తుండిపోయారు. ఆయనకీ మనస్సుందిగా...

"సరె నేను ఫ్రెషప్ అయి వస్తాను. వీడిని చూస్తుండు. మళ్లీ బైటికి పోతాడేమో?.." అని ఆయన లోపలికి వెళ్లారు.

ఇద్దరం టీ తాగాము. వాడిని నిద్ర లేపాను. కొంచెం పాలు వేడి చేసి ఇచ్చాను.

"కాంప్లాన్ కావాలి" అన్నాడు కళ్లు నులుముకుంటూ.. ఆయన నా వైపు వెక్కిరింపుగా చూశారు.

కొంచెం బ్రూ కాఫీ పొడి లైట్‌గా కలిపి అదే కాంప్లాన్ అంటూ వీడి చేతికి ఇచ్చాను. చాలా కష్టపడి తాగాడు.

ఎన్నిసార్లు ఆయనా నేను అడిగినా వాడి పేరు 'రాజు' అని తప్ప ఇంకేం వివరాలు చెప్పలేకపోతున్నాడు.

"పోలీసు స్టేషన్‌లో అప్పగిస్తే.." అన్నాను నేను.

"పోలీసులు పదిసార్లు ఎంక్వయిరీలు అవి ఇవి అంటూ మనల్ని స్టేషన్ చుట్టూ తిప్పించుకుంటారు." అన్నారు.

అదీ నిజమే అన్పించింది.

"ఒరే బాబూ! మీ ఇల్లెక్కడో చూపిస్తావా నేను తీసుకెళతాను.." ఓపిగ్గా అడిగారాయన.

వాడు చాలా ఇంటెలిజెంట్‌లా 'ఓ' అన్నాడు. అమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నాను నేను.

ఆయన వెనుక బైక్ మీద కూర్చుంటూ వాడు ఎంతో మామూలుగా 'బై' చెప్పాడు. కానీ నాకే ఏదోలా అనిపించింది. చాలా సేపు అచేతనంగా ఉండిపోయాను. వంట చేయ బుద్ధి కాక చాలాసేపు ఆలోచిస్తూ ఉండిపోయాను.

చాలా రాత్రయ్యింది ఆయన రాలేదు. సెల్‌కి ఫోన్ చేస్తుంటే రెస్పాన్స్ లేదు. కాసిని బియ్యం కడిగి కుక్కర్లో పెట్టాను. అయినా ఆయన రాలేదు. పదకొండు గంటలు అయ్యింది.

నాలో కంగారు మొదలయ్యింది. ఏం జరిగి ఉంటుంది? వాడ్ని వాళ్లవాళ్లకి అప్పగించి ఉంటారా? అసలు వాడి అడ్రస్ దొరికి ఉంటుందా?.. ఒకటే ఆలోచనలు.

అరగంట గడిచాక గేటు చప్పుడయ్యింది. ఎదురెళ్లి ఏం జరిగింది? అని అడిగే సాహసం చెయ్యలేకపోయాను.

ఉసూరుమంటూ వచ్చి సోఫాలో జారగిలబడ్డారు. మంచినీళ్లు తెచ్చి ఇవ్వగానే గబగబా తాగేశారు. పాపం అనిపించింది. స్థిమితపడ్డాక జరిగింది చెప్పారు.

"అక్కడా ఇక్కడా అంటూ సిటీ మొత్తం తిప్పించేశాడు వెధవ. ఇల్లు మాత్రం దొరకలేదు. ఇంక వేరే దారి లేక నువ్వన్నట్టుగా పోలీసు స్టేషన్లో అప్పగించాను.

"వాడి మాటలు నమ్మి ఊరంతా తిరిగారా!" అంటూ ఎస్.ఐ. అదోలా చూశాడు. నేనేం పట్టించుకోలేదు. ఇద్దరు ముగ్గురు పిల్లలు కనిపించటం లేదని

కంప్లెయింట్స్ ఉన్నాయని చెప్పాడు. అడ్రస్ తీసుకుని అవసరం అయితే కబురు చేస్తామని చెప్పాడు.''

"వాడేం గోల చెయ్యలేదా! అదేమిటో వస్తానని..'' ఎందుకలా అడిగానో నాకే అర్థం కాలేదు.

"నీకెలా బై చెప్పాడో అలాగే హేపీగా బై చెప్పాడు. అప్పుడప్పుడు ఇలా ఇల్లొదిలి రావటం అలవాటులా ఉంది వెధవకి..'' అంటూ నవ్వారు.

తర్వాత చాలా రోజులు వాడు గుర్తొచ్చాడు. చారికలు కట్టిన వాడి పసి బుగ్గలు, తెలిసీతెలీని వాడి పసిముఖం, వేణు చొక్కా వేస్కోటం రాక నా చేతి కిచ్చి వెయ్యమనటం పదేపదే గుర్తొచ్చేవి.

★★★

పది నెలల తర్వాతనుకుంటాను. నేను ఆయన ఓ పెళ్లి సందర్భంగా విజయవాడ వెళ్లి తిరిగి వస్తుండగా ట్రైన్‌లో ఓ కుర్రాడు తొడుక్కున్న చొక్కా విప్పి మేము కూర్చున్న పెట్టె కింద తుడిచి అందర్నీ డబ్బులు ఇమ్మని చేయి చాచి అడుక్కుంటున్నాడు.

నేను పర్సు తీసి రూపాయి బిళ్ల తీసి ఇవ్వబోతుండగా అది జారి కిందపడింది.

వీడు కిందకి వొంగినప్పుడు వాడి వీపు మీద కనిపిస్తున్న పుట్టుమచ్చని చూడగానే మిట్ట మధ్యాహ్నం పూట మా ఇంటికొచ్చి నా సహనాన్ని మా ఆయన సహనాన్ని పరీక్షించిపోయిన కుర్రాడు గుర్తొచ్చాడు.

"ఏమండీ! వీడు మనింటికొచ్చిన రాజండీ...'' అన్నాను ఎగ్జయిట్ అయిపోతూ నేను.

"చాల్లే ఊర్కో! అందరూ నీకు అలాగే కన్పిస్తున్నారీమధ్య. మొన్న కూడా ఓ కుర్రాడ్ని చూపించి "రాజుగాడిలా ఉన్నాడండీ'' అన్నావు'' అన్నారు.

"కాదండీ వీడు రాజుగాడే... వాడి వీపు మీద పుట్టుమచ్చ నేను చూశాను. ఆరోజు నేనే వాడికి చొక్కా తొడిగాను. వీడి వీపుమీద పుట్టుమచ్చ చూసి అడవిరాముడు సినిమాలో ఎన్టీఆర్‌కి ఉన్న పుట్టుమచ్చలా ఉంది.. అదృష్టవంతుడు అవుతాడు వీడు.. అనుకున్నాను.'' నమ్మకంగా అంటుంటే ఆయనా ఆలోచనల్లో పడ్డారు.

"అయితే ఏమంటావిప్పుడు!'' అడిగారు.

"అసలు అప్పుడు వీడు వాళ్లవాళ్ల దగ్గరకు వెళ్లలేదా? ఏం జరిగిందో ఇక్కడికెలా వచ్చాడో కనుక్కోండి.''

"ఏంరా! నీ పేరు రాజు కదా!''అని ఆయన అడగ్గానే వాడు తల ఊపాడు.

"మరి?... ఇక్కడికెలా వచ్చావురా?'' అని లాలనగా వాడిని అడిగారు.

వాడు ప్లాట్‌ఫాం వైపు చూపించాడు. అక్కడ అడుక్కుంటున్న ఓ ముసిలాడు కనిపించాడు. మాకేం అర్థం కాలేదు.

"తాత..'' అన్నాడు రాజు.

మాకేం అర్థం కాలేదు.

అంతలో ట్రైన్ కదిలింది. ముసిలాడు కంగారుగా మేము కూర్చున్న పెట్టె బయట కర్రతో టకటకమని చప్పుడు చేస్తూ "ఒరే బద్మాష్ నా కొడకా.. దిగ వేంరా వొళ్లు కొవ్వెక్కిందా! నాయాలా సంపేత్తానా కొడకా!'' అంటూ బూతులు తిడుతుంటే..

"ఏం రా! వాడు నిజంగా నీకు తాతేనా!'' అని అడుగుతుంటే వాడు భయంగా మా కాళ్లకిందికి జారిపోయి బెర్త్ కింద దాక్కున్నాడు.

మేము హైదరాబాద్‌లో దిగగానే వాడూ దిగాడు. మాతో పాటే ఇంటికి వచ్చాడు.

మేమూ వాడి గురించి పెద్దగా ఆలోచించలేదు. మరోసారి వేణు బట్టలు వాడికి ఇచ్చాను.

మా వారు వాడి గురించి ఎంక్వయిరీ చేయించారు.

ఆర్నెళ్ల తర్వాత వాడి గురించి తెలిసిన ఓ నిజం విని వెన్నులో వణుకు పుట్టించింది.

ప్రేమ వివాహం చేసుకున్న వాడి అమ్మానాన్న బలహీనతలకు లొంగిపోయి తమకు హెచ్.ఐ.వి. పాజిటివ్ అని తెలియగానే కన్నబిడ్డని రోడ్డుపాలు చేసి వాళ్లు సూసైడ్ చేసుకున్నారు. అప్పట్నించి వాడిని ఆదరించిన వాళ్లూ లేరు. ఆదుకున్నవాళ్లూ లేరు. గాలి ఎటు వీస్తే అటు ఎండుటాకులా కొట్టుకుపోతూ ముళ్లహ తగిలాడు.

ఇప్పుడు రాజు చక్కగా స్కూలుకెళ్లి చదువుకుంటున్నాడు. కనకపోయినా నేను, మా ఆయన వాడికి అమ్మ నాన్నలా అయ్యాం. ఈ విషయాలన్నీ మెయిల్ చేసి వీడి ఫోటో ఒకటి నెట్‌లో పెట్టి వేణుకు చూపించటం నాకెందుకో నచ్చలేదు. కవరు మూసేసిన కంప్యూటర్ ఇప్పుడు మా ఇంట్లో పూర్తి విశ్రాంతిలో ఉంది.....

★

## 10 నెలల పిల్లవాడికి గన్ లైసెన్స్

అమెరికాలో ఇల్లినాయిస్‌లో లడ్విక్ తండ్రి హోవర్డ్ తన కొడుకుకోసం ఐదు డాలర్లు కదాని ఆన్‌లైన్‌మీద గన్ లైసెన్స్‌కి అప్లై చేసాడు. లైసెన్స్ దొరికిందిగానీ ఆ కుర్రాడి వయస్సు కేవలం 10 నెలలు. ఇల్లినాయిస్‌లో గన్ రూల్స్ చాలా కఠినంగా ఉంటాయి. ఆ కుర్రాడికి 14 ఏళ్లు వచ్చేవరకు గన్ ఇవ్వరాదని అధికారులు అనడంతో తండ్రి ప్రస్తుతం కొడుకుకు బొమ్మ తుపాకీని ఇచ్చాడట.

## కారులో పురుళ్లు

17 నెలల క్రితం స్టెఫనీగ్రీన్‌కి పురిటి రోజు దగ్గర పడిందని హాస్పిటల్‌కు బయల్దేరారు. కారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. అదే సమయంలో ఆమెకు హఠాత్తుగా నొప్పులొచ్చి కార్లోనే ఆడపిల్లను కంది. రెండోసారి ముందుజాగ్రత్తగా కాస్త ముందుగానే రమ్మన్నారు డాక్టర్లు. తన ఫ్రెండు శానికా వెంటరాగా కారులో బయల్దేరింది గ్రీన్. హాస్పిటల్ మరి కొంచెం దూరంలో ఉందనగానే ఆమెకు హఠాత్తుగా నొప్పులొచ్చి మళ్లీ కార్లోనే బిడ్డను కనేసింది గ్రీన్.

-తటవర్తి

